## కథ

# చంద్రునికో నూలిపోగు

కోపూరి పుష్పాదేవి

అక్కా! నా సంగతి ఏం చేశావు...? గదిలోమూల నేలమీద గోడకు చేరబడి కూర్చున్న సుజాతను విసురుగా అడిగాడు సత్యం.

ముందున్న టిఫిన్ ప్లేటులో చల్లారిపోయిన ఉప్మాని చెంచాతో కెలుకుతున్న ఆమె మాట్లాడలేదు.

'ఏమక్కా మాట్లాడవు...? ఎన్నాళ్ళనుంచి అడుగుతున్నాను... ఉలకవు, పలకవు. అసలు నీ ఉద్దేశ్యమేమిటో చెప్పు...' ఈ వేళ తాడో-పేడో తేలిపోవలసిందేనన్నట్లు ఆమె ఎదుట బైఠాయించాడు సత్యం.

సుజాత మౌనం వీడలేదు. మెదడు ఆలోచనా శక్తిని కోల్పోయినట్లు ఆమె చూపులు నిస్తేజంగా ఉన్నాయి.

'ఏమిట్రా నీ గొడవ...? అసలే దాని మనసు బాగోక అది ఏడుస్తుంటే మధ్యలో నీ భాగవతమేమిటి...? అన్నది సత్యం పెద్దక్క పద్మ.

'అదేనే... మా చిన్నాడు మురళిని దీనికి దత్తత ఇద్దామనుకుంటున్నాము గదా.... ఇప్పుడున్న వదిమందిలో ఒక మాట అనుకున్నామనుకో ... ఒక పని అయిపోతుందని నా ఆరాటం'

నీ ఆదుర్దా నువ్వు చూసుకుంటావు గానీ,దానిబాధ చూడవా. మొగుడుపోయి పదోరోజు, పుట్టెడు దుఃఖంలో అదుంటే ఇప్పుడు అలాంటివి మాట్లాడ కూడదురా...'

సింగినాదం లెద్దూ..., నువ్వయినా దానికి చెప్పి ఒప్పించవే పెద్దక్కా... నా ప్రాణానికి ఆ సుబ్బారావు గాడొకడు.. తయ్యిమంటూ పోటీకి వస్తున్నాడు. సుజాత ఎక్కడ వాడి కొడుకును పెంచుకోడానకి ఒప్పుకుంటుందో అని నా భయం నాది...'

'ఏమయినా గానీ, ఇప్పుడు ఆ వ్యవహారం వద్దు. ముందు నువ్వు అవతలకు వెళ్ళు. అన్నమూ, నీళ్ళూ మానేసి అది అలా ఏడుస్తుంటే నీ గోలే నీది.... ఆ సంగతి తర్వాత చూద్దాంలే...'

'అమ్మా, నాన్నా లేరు గనుక నిన్నే బ్రతిమాలుకున్నాను. కానీ నీతో లాభంలేదు. నేనే అమీ తుమీ తేల్చుకుంటాను' అని పద్మతో చెప్పి, సుజాతవేపు తిరిగి, ఇదిగో చిన్నక్కా... బావ ముచ్చటా బావకూడా చూసుకునేవాడు. ఎప్పటినుంచో చెబుతుంటే విన్పించుకున్నారు గాదు... ఇప్పుడే చెబుతున్నా... ఆస్థంతా మా అబ్బాయి పేరుమీద ఇప్పుడే రాయాలి...' అన్నాడు. గట్టిగా డిమాండ్ చేశాడు, సత్యం.

ఇప్పుడూ సుజాత ఏమీ మాట్లాడలేదు.

అసలు వదిన నీ కొడుకుని ఎందుకు పెంచుకుంటుంది..? మా అన్నయ్యకు నా కొడుకు కిరీటి అంటేనే ఇష్టం. వాణ్ణే పెంచుకుందామనుకున్నారు. ఆస్థి మా వాడి పేరుమీదనే రాస్తావు కదూ వదినా.. ' అన్నది తగాదాకు సిద్ధపడుతూ సుజాత ఆడబడుచు వనజ.

'బాబూ నువ్వెంత బుద్ధిమంతుడవో అందరకూ తెలుసు. కొత్తకొత్త వ్యాపారాలు పెట్టటం, పెట్టుబడి పెట్టిన అందరి సొమ్ములూ తినేసి ఐ.పి బోర్డులు తగిలించెయ్యడం..., అలాంటివాడివి.నీ కొడుకును పెంచుకోవాలా...? వనజ మొగుడు సుబ్బారావు సత్యం మీదికి దండెత్తాడు.

'అయితే, నువ్వు మాత్రం గొప్ప సత్య సంధుడినంటావు. అందుకేనా, గుమాస్తాగా ఉండి నమ్మిన యజమానిని నట్టేట్లో ముంచి, ఆయన ఆస్థంతా కాజేసి, ఇప్పుడు వ్యాపారం పెట్టి వెలిగిపోతున్నావని నీ బండారం జనం మర్చిపోయారనుకుంటున్నావు కాబోలు...లేదు లేదు కథలు కథలుగా చెప్పుకుంటున్నారు. నీ కొడుకుని మా అక్క ఛస్తే పెంచుకోదు. సత్యం ధాటీగా తిప్పి కొట్టాడు.

మగవాళ్ళు వాగ్యుద్ధాల్లో ఉంటే, వనజ, సత్యం భార్య కావేరి 'మేము మాత్రం తక్కువ తిన్నామా...? అన్నట్లు కొప్పులు పట్టుకోవడం దాకా వెళ్ళి పోయారు. ఆ రణ రంగాన్ని భరించలేక 'నేనెవరి కొడుకునీ పెంచుకోను. ఇక ఈ యుద్ధాలు ఆపండి' ఏడుస్తూ పెద్దగా అరిచింది సుజాత. పది రోజులనుంచీ సరి అయిన భోజనమూ, నిద్రాలేని ఆమె శరీరం ఆకులా పెనుగాలిలో వణుకుతోంది.

'నీ కనలు మాతృ హృదయంలేదు. నువ్వసలు ఆడదానివే కాదు...' తన ఉక్రోషాన్నంతా ఆ రెండు మాటల్లో వెళ్ళగ్రక్కుతూ సుజాత గుండెల్లో గునపాలు గుచ్చింది కావేరి.

'అవును. నువ్వు అచ్చమైన గొడ్రాలివి. అందుకే బిడ్డలమీద ప్రేమ, మమకారంలేదు నీకు...' సుజాత హృదయానికి శరాఘాతం చేసింది. వనజ.

'ఇదిగో అక్కా ఇప్పుడే చెబుతున్నా... నా కొడుకుని గనుక పెంచుకోకపోతే నీ ముఖం జన్మలో చూడను. నీకు పుట్టింటి ఆశ ఇక లేదనుకో ... గట్టిగా ఆలోచించుకో ... చివాలున లేచి వెళ్ళిపోయాడు సత్యం. భర్తను అనుసరించింది అతని భార్యామణి. ముఖం మెటమెట లాడించుకుంటూ.

నా కొడుకుని పెంచుకోకపోతే, మేమూ ఇంక నీ గడప తొక్కం వదినా..., అదీ గుర్తుంచుకో.. రండి ఇంకా ఎందుకు ఇక్కడ...? మన బుజ్జిగాడిని పెంచుకోవడానికి వదిన ఎప్పుడు ఒప్పుకుంటుందో అప్పుడే మళ్ళీ మనం ఈ గుమ్మం ఎక్కేది...' సుబ్బారావుని లాక్కెళ్ళింది వనజ.

పెద్దవాళ్ళు ఎంత బతిమిలాడినా వినక, పదకొండో రోజు కార్యక్రమానికి ఉండకుండా ఆ నలుగురూ వెళ్ళిపోయారు.

తోబుట్టువులు పెట్టిన ఆ రంపపుకోతతో మొదలు విరిగిన మహావృక్షంలా కూలిపోయింది సుజాత.

=====

సుజాత, సూర్యం అన్యోన్య దంపతులు. సూర్యం క్లాత్ బిజినెస్‌లో బాగా సంపాదించాడు. ఆస్థి పెరిగినా వారిలో అహంకారం పెరగలేదు. ఆర్తులైన వారి నాదుకుంటూ మంచి వారనే కీర్తి గడించారు. కానీ, వారికి ఒక తీరని లోటు సంతానం లేకపోవడం. ఎన్ని ఆసుపత్రుల చుట్టూ తిరిగినా, ఎన్ని నోములు నోచినా వారి తపస్సు ఫలించలేదు. చివరకు గర్భసంచి లోపం వలన సుజాత తల్లి అవలేదని తేల్చి చెప్పారు వైద్యులు.

ఇన్నాళ్ళూ ఆ దంపతుల హృదయాల్లో ఏ మూలో మినుకు మినుకుమంటున్న ఆశ ఆ నాటితో పూర్తిగా అడుగంటింది. నిరాశాభూతం నిలువెల్లా కమ్మేసింది. వారి జీవన లతలు మోడు వారిపోయాయి. సుజాత మనసులో అగ్ని పర్వతం బద్దలై కన్నీటి లావా ఆమె శరీరాన్ని దహించి వేస్తున్నట్లుగా ఉంది.

అప్పటికి మూడు రోజులైంది ఆమె భోజనం చేసి. కనీసం కాఫీ, టీ, పళ్ళరసం లాంటివి కూడా త్రాగడంలేదు. సూర్యం గరళకంఠునిలా తన విచారాన్ని తనలోనే దాచుకుని భార్యను బతిమలాడుతున్నాడు 'నా కోసమైనా ఒక్క ముద్ద అన్నం తిన'మని. ఆమె ససేమిరా తినలేనంటోంది. తినలేక పోతుంది.

నేనూ మూడురోజుల నుంచీ ఏమీ తినలేదు. ఆకలవుతోంది నీరసం వస్తోంది. కళ్ళు తిరుగుతున్నాయి. అయినా, నువ్వు తింటేగానీ నేను తినను. నా కోసం ఒక్క ముద్ద తిను... అన్నాడు. సూర్యం ఆమె గడ్డం పుచ్చుకుని.

తినలేక పోతున్నానండీ.... నేను తినను... దయచేసి మీరు తినండి...'

'నువ్వు తినకపోతే నేనూ తిననని చెప్పానుగా...'

'తినబుద్ధి కావడం లేదు... నన్నేం చెయ్యమంటారు...?

'అంటే సుజా... నీకు నాకంటే ఆ పుట్టని పిల్లలే ఎక్కువన్నమాట...'

'అబ్బెబ్బే అలా కాదు. మనసు బాగుండక తినలేకపోతున్నానంతే...'

ఇంతలో డోర్‌బెల్ మోగింది. సత్యం వచ్చాడు.

'ఏమిటి ఇద్దరూ అలా ఉన్నారు... పదిలంకణాలు చేసినట్లు...' అన్నాడు సత్యం.

బావమరిదిని ఆపద్బాంధవుడిలా భావించిన సూర్యం అన్నీ చెప్పి తన మనసులోని భారం దించుకున్నాడు.

సత్యం కళ్ళు వింతగా మెరిశాయి. వెయ్యివోల్టుల బల్బులా అతని ముఖం వెలిగింది.

'సుజా.. దీనికింత దిగులు పడాలా అమ్మా...? నీకు పిల్లలు పుట్టరన్న సంగతి ఇంక మర్చిపో ... మురళి అచ్చంగా నీ బిడ్డే. నీకు పుట్టిన బిడ్డే అనుకో... రేపే వాణ్ణి తీసుకొచ్చి నీ దగ్గర వదిలేస్తాను. దత్తత స్వీకారం ఫంక్షనూ అదీ గ్రాండ్‌గా చెయ్యాలి సుమా...' అన్నాడు అన్నీ తనే నిర్ణయిస్తున్నట్లు.

సత్యం మాటలకు సుజాత, సూర్యం ఇద్దరూ తెల్లబోయారు. ఏం మాట్లాడాలో వాళ్ళకర్థం కాలేదు.

'ఇప్పుడవన్నీ వద్దు.తర్వాత చూద్దాం' అన్నాడు సూర్యం. నీటిజాడ ఎరుగని మొక్కలా సత్యం ముఖం మాడిపోయింది వెంటనే లేచి వెళ్ళిపోయాడు. ధుమధుమలాడుతూ.

వార్త ఎలా తెలిసిందో ఏమో మరి, మరునాడే వనజ పరుగెత్తుకు వచ్చింది తన ఐదేళ్ళ కొడుకుతో సహా.

'అన్నయ్యా ... ఎంత కష్టం వచ్చింది... ఎంత కష్టం వచ్చింది.. వింటుంటే నాకే ఇంత బాధగా ఉంది. మరి మీకెంత ఉంటుందో నేను ఊహించగలను. కానీ, మీరు ఇక పిల్లలు లేరనీ, పుట్టరనీ అస్సలు బాధ పడద్దు. విచారం వద్దు. ఈ కిరీటిగాడు ఇక మీ కొడుకే... వాణ్ణి ఎలాపెంచుకుంటారో... ఎలా చదివించుకుంటారో అంతా మీ ఇష్టం. నేను కానీ, మా ఆయన కానీ అస్సలు పట్టించుకోము....' వరమిచ్చిన దేవతలా మాట్లాడింది వనజ.

ఆమెకు ఏం చెప్పాలో అర్థంకాక, ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు సూర్యం సుజాతలు.

చివరకు, 'ఇప్పుడు కాదమ్మా... తర్వాత చూద్దాం...' అన్నాడు సూర్యం.

బొగ్గుగా మారిన ముఖంతో కొడుకుని తీసుకుని ఆమె విసవిసా వెళ్ళిపోయింది. కానీ, వంతులు వేసుకున్నట్లు సత్యం, కావేరీ, వనజ, సుబ్బారావులు వారానికి ఒకసారైనా ఏదో వంకతో వచ్చి సూర్యం, సుజాతల చెవుల్లో జోరీగల్లా రొదపెడుతూ సతాయించసాగారు. పిల్లలు పుట్టని బాధకంటే ఈ బాధ ఎక్కువయింది ఆ దంపతులకు. 'ముందు చూస్తే నుయ్యి-వెనుక చూస్తే గొయ్యి' అన్నట్లు తయారయింది వారి పరిస్థితి.

అంతలో అనుకోని సంఘటన. గుండెపోటుతో సూర్యం హఠాన్మరణం.

++++++

సుజాత దిగులుతో కృంగికృశిస్తోంది. భర్త మరణం ఒక వంకా, ఆత్మీయుల నిరాదరణ మరోవంకా ఆమె మనసును పీల్చి పిప్పి చేస్తున్నాయి ఎన్నాళ్ళు గడిచినా ఆమె తేరుకోలేక పోతోంది. 'ఆమెను ఆ దుఃఖసముద్రం నుండి ఎలా ఒడ్డున పడెయ్యాలా' అని చాలా ఆలోచించిన పద్మ ఆమె భర్త సుధాకర్ తరుణోపాయంగా సుజాత చేత తీర్థయాత్రలు చేయించాలని నిశ్చయించారు. రిజర్వేషన్లూ అవీ చేయించుకుని సుజాతతో భార్యాభర్తలు బయలుదేరారు.

ఎన్నో పుణ్య క్షేత్రాలు తిరిగారు. వారి

ఉపాయం ఫలించింది. క్షేత్ర దర్శనం, తీర్థ స్నానం సుజాత మనసును బాగానే స్వస్థత పరిచాయి. అయినా, ఏ నగరం చూసినా మేడలూ, మిద్దెలూ, వలు అంతస్థుల భవనాలూ, విశాలమైన రహదారులతో అభివృద్ధి పథంలో పయనిస్తున్నట్లుగా కనిపిస్తున్నాయిగానీ, వీధుల్లో ప్రతి చెత్తకుండీ దగ్గరా ఒకటో రెండో ఆవులు డొక్కలెండిపోయి ఆహారం కోసం అలమటిస్తూ దీనంగా, హీనంగా కనిపించాయామెకు. ఆమె మనసు మళ్ళీ వికలమయ్యింది.

**'మంగళం దర్శనం ప్రాతః పూజనం వరమం వదం- దర్శనం వరమతీర్థం నాస్తి ధేను నమం క్వచిత్.'**

చిన్నతనంలో నానమ్మ నేర్పించిన శ్లోకం గుర్తుకు వచ్చింది సుజాతకు. గోమాతను దేవతగా, లక్ష్మీ స్వరూపంగా భావించి పూజించే మనదేశంలో ఆవులకు ఈ దుస్థితి ఏమిటి...?

ఒకప్పుడు గోవులు తమ పాలతో, పెరుగుతో, నెయ్యితో ప్రజలకు పుష్టి కలిగించాయి. ఆఖరుకు గోమూత్రమూ, పేడా కూడా యాంటీ బ్యాక్టీరియాగా ఉపయోగ పడతాయి. ఇంకా వ్యవసాయంలో ముఖ్య పాత్ర వహించిన గోసంతతి ఇప్పుడెందుకు నిర్లక్ష్యంచెయ్య బడుతున్నాయి...?ఎందుకు చెత్తకుండీల పాలవుతున్నాయి,...? ప్రశ్నలు... ప్రశ్నలు... జవాబు దొరకని ప్రశ్నలు...!

రాత్రి పన్నెండు గంటలయింది. ఆ రోజు సుజాతకు ఎంత సేపటికీ నిద్ర పట్టలేదు. అటుపొర్లీ, ఇటుపొర్లీ నానా అవస్థలూ పడినా, నిద్రాదేవత కరుణించనంటోంది. ఏవేవో ఆలోచనలు.. ఎంతకీ తరగని, తుదిలేని ఆలోచనలు... ఎందుకో ఆమె మనసు గతాన్ని స్పృశించింది.

'చిన్నతనంలో తను ఎంతో గారాబంగా పెరిగింది. కోరినవన్నీ తనకు క్షణాలలో సమకూరేవి. ఎందుకనోగానీ, మొదటినుంచీ తనకు చదువుమీద పెద్దగా శ్రద్ధ ఉండేది కాదు. అందువల్ల అత్తెసరు మార్కులతో డిగ్రీ పూర్తిచేసింది. కానీ, సాహిత్యంపైనా, సమాజసేవ కార్యక్రమాల పట్లా గొప్ప ఆసక్తి ఉండేది. చదువుపై తన అనాసక్తి తెలిసిన నాన్న సంబంధాలు చూడటం ప్రారంభించాడు. వరుడు గొప్ప చదువులు చదివి ఉండాలనీ, పెద్ద ఉద్యోగం చెయ్యాలనీ తనకేమీ భారీ కోరికలు ఉండేవికావు. అందువల్ల సామాన్య స్థితి పరుడైన సూర్యం సంబంధానికి ఒప్పుకున్నది. కానీ, తన అదృష్టం వల్ల సూర్యానికి కూడా నలుగురికీ మేలు చెయ్యాలన్న తపన అధికంగా ఉండేది.

'అటువంటి సూర్యాన్ని పోగొట్టుకున్నాను...' ఆమెకు దుఃఖం పొంగుకొచ్చింది. వెక్కిళ్ళు శబ్దం విని ప్రక్కనే పడుకున్న పద్మ కంగారుగా లేచింది.

'ఏమిటమ్మా సుజా!... నిద్ర పట్టలేదా.. సూర్యాన్ని గుర్తు చేసుకుని ఏడుస్తున్నావా... పోయిన వాళ్లతో మనమూ పోలేము కదా... మనసు కుదుట పరచుకోవాలమ్మా... నీ కిష్టమైన ఆ రాముణ్ని ధ్యానం చేసుకో.. నిద్ర పడుతుంది.' అంటూ పద్మ సుజాతకు దగ్గరగా జరిగి ఆమె వెన్నుమీద చెయ్యివేసి నిమరసాగింది. మళ్ళీ రెండు నిముషాల్లో పద్మకు గాఢంగా నిద్ర పట్టింది. చిన్నగా గురక పెట్టసాగింది.

సుజాత పద్మముఖంలోకి చూసింది. బెడ్‌లైట్ కాంతిలో ఆమె ముఖం ప్రశాంతంగా ఉంది. 'నిష్కల్మషమైన మనసుగలవారే ప్రశాంతంగా ఉండగలరు.' ఎక్కడో చదివిన వాక్యం సుజాతకు జ్ఞప్తికి వచ్చింది. పద్మ నడుము మీద చెయ్యి వేసుకుని నిద్రపోవడానికి గట్టిగా ప్రయత్నించింది. ఊహు నిద్రరాందే... మళ్ళీ ఆలోచనలు ఆమె మనసును పీక్కుతినసాగాయి.

'ఒక్కగానొక్క తమ్ముడు. తోడపుట్టిన వాడుకదా... తనని ఆదుకుంటాడు అనుకున్నది తను. కానీ, 'వాడి ప్రేమ తనమీద కాదు. తన ఆస్థిమీద' అని ఈ మధ్య కాలంలో బాగా తెలిసి వచ్చింది. అటు ఆడబడుచు చూస్తే అలా... ఇటు వీడు చూస్తే ఇలా... 'కరవమంటే కప్పకు కోపం- విడవమంటే పాముకు కోపం. అడకత్తెరలో పోకచెక్కలా' అయింది తన పరిస్థితి.

ఈ సమయంలో పద్మక్కా, బావగారూ తనను శ్రద్ధగా పట్టించు కోకపోతే తను ఏమయి పోయేదో...? ఆత్మహత్య అయినా చేసుకుని ఉండే దాన్ని, లేదా మతిభ్రమించి అయినా ఉండేది. అక్కకూ, బావగారికీ ఇద్దరికీ అనారోగ్యమే. నిజానికి ఊళ్ళుతిరగగలిగిన పరిస్థితి కాదు వాళ్ళది. కానీ, తనకోసం కష్టపడి ఇన్ని ఊళ్ళు తిరుగుతున్నారు. ఏమిచ్చి వీళ్ళ ఋణం తీర్చుకోగలను...? కన్న తల్లికన్న ఎక్కువగా నన్ను కడుపులో దాచుకున్న ఈ అక్కకు కృతజ్ఞతలు ఎలా చెప్పుకోగలను...? సుజాతను మరోసారి దుఃఖం ముంచేసింది. కానీ, నిగ్రహించుకున్నది. తనవల్ల అక్కనిద్ర కూడా పాడవుతుంది.' అనుకుని

'ఏమిటీ రాత్రి... నా పాలిట కాళరాత్రి అయింది...? ఎంతకూ నిద్రరాదు' అనుకుంటూ గడియారం వంక చూసింది, సుజాత. సరిగ్గా రెండు గంటలయింది. మళ్ళీ ఆమె ఆలోచనలు ఆవులమీదకు మళ్ళాయి.

పెరుగుంబాలు ఫలించుచున్
నిరతమున్ విశ్వంబు బోషించు ని
న్నరవం కుత్తుక కోయు
దాయలకు ద్రవ్యాశన్ సమర్పించు
ముష్కరుల్ కొమ్ముల జిమ్మ వేటికి?
స్వచ్ఛంబైన నీ వెన్నతో
విరచింపం బడెనేమొ నీ మనసు
దేవీ ఆవు ముత్తయిదువ!

ఎప్పుడో చదివిన గుర్రం జాషువా గారి పద్యం గుర్తొచ్చింది సుజాతకు. అంతటి పరమ పవిత్రమైన ఆవులకు ఈ దుస్థితి ఏమిటి...? ఈ విషమ పరిస్థితికి పరిష్కారం ఏమిటి?

ఆమెకు మెరుపులా ఒక ఆలోచన వచ్చింది. 'వాళ్ళ బుద్ధులు తెలిశాక కూడా అటు తమ్ముడి కొడుకునో, ఇటు ఆడబడుచు కొడుకునో దత్తత చేసుకునే ఉద్దేశ్యం తనకెటూ లేదు. కాబట్టి తనకున్న ఆస్థిని నిర్భాగ్య స్థితిలో ఉన్న ఆవులకోసం ఉపయోగిస్తే...? కొంత వరకైనా గోజాతిని సంరంక్షించగలిగితే...? తద్వారా భావి తరానికి మేలు ఒనగూరుతుంది గదా...? సూర్యం తనకిచ్చిపోయిన ఆస్థిని ఈ విధంగా సద్వినియోగం చేస్తే అతని ఆత్మ తప్పక శాంతిస్తుంది. రేపు అక్కా బావలతో ఈ విషయం చర్చించాలి' అనుకున్నది సుజాత.

చక్కని ఆలోచన తట్టిన సంబరంతో సుజాత ప్రశాంతంగా నిద్రాదేవి ఒడిలో సేదతీరింది.